# విలువలు

శ్రీమతి బెహరా సాహితి

"వస్తానే సుశీ! రేపు కాలేజీకి ఆ నవల పట్రావడం మర్చిపోకు."

"ఓ! అలాగే! మరి వుంటా!... తొందరగా అడుగులు వెయ్యాలి ప్రమీలా! పైన చూశావా!... నల్లని మబ్బులు గుంపులు గుంపులు." పాటలా సాగదీసింది.

"అమ్మో!! వర్షం వస్తుందో, ఏమో! నీకేం, గూటికి చేరిన పక్షివి. ఈ వానలో తడిసి, ఈ రాత్రి వేళ యింటికి చేరితే, ఇక చూస్కో, మా అమ్మ సాధింపులు. 'అందుకే ఆడపిల్లలకి సినిమాలు, షికార్లు పనికి రావనేది, చీకటి పడే సరికింటి పట్టున వుండక..' అంటూ మొదలవుతుంది."

"ఈ పెద్ద వాళ్లే యింత లెద్దూ! నెలపైనే అయింది మనం సినిమా కెళ్లి, మళ్లీ ఈవాళ్టికి కుదిరింది."

"నే పోతా బాబూ! మా తమ్ముడినైనా రమ్మన్నాను కాదు, సినిమా హాలు దగ్గరికి. వానొచ్చేలోగా యింటికి చేరుకుంటే.. వస్తానే మరి.. బై... బై.."

ప్రమీల చురుగ్గా అడుగులు వేసింది. పమిట బుజాల నిండుకూ కప్పుకుంది. సుశీలా వాళ్ల సందు మలుపు తిరిగింది. చూపు దూరంలో జన సంచారం లేదు. రోడ్డు కటు, యిటు వున్న చెట్లు, చలనం లేకుండా, ఊపిరి బిగపట్టి, ఏదో ఘోరాన్ని చూస్తున్నట్లుగా బిగుసుకుపోయి, నిల్చున్నాయి. పొడుగాటి మెడలు క్రిందికి వంచి, ఒంటి కళ్ల రాక్షసుల్లా వరసగా నిలబడి, కిందికి కుతూహలంగా చూస్తున్నాయి వీధి దీపాలు. తల పైకెత్తి చూసింది ప్రమీల. హడావుడిగా, కొంపలు మునిగేంత అర్జంటు పనులేవో వున్నట్లు పరుగులు తీస్తున్నాయి నల్లని మేఘాలు, "నీ చిన్నెల కేం లే! నన్నలా పోనీ!" అంటూ ఆకాశంలో మరెక్కడా దోవ లేనట్టు, చంద్రుడ్ని కప్పేస్తూ, ఓ పెద్ద మేఘం, మోటుగా దూసుకు పోతూంది.

టప.. టప.. చినుకులు. ఉలిక్కి పడింది ప్రమీల. "ఎంత లేదన్నా మరో మూడు ఫర్లాంగులుంటుంది ఇల్లు." నడక వేగం హెచ్చించింది. అంత కన్న వేగంగా పడసాగాయి చినుకులు. ఇక బిగపట్టుకోవడం నా తరం కాదన్నట్టు, ఒక్క సారిగా హోరున వర్షం మొదలైంది. "బాప్‌రే! ఇదేం వర్షంరా బాబూ" ప్రమీలా నిముషంలో తడిసి ముద్దయింది. "ఓ క్షణం యీ యింటి అరుగు మీద నిల్చుంటే..." ఆ ఆలోచన పూర్తయిందో లేదో, అప్రయత్నంగా ఆమె కాళ్లు ఆ యింటి మెట్లెక్కాయి. పై మెట్టు దగ్గర నిలబడి, మొహం మీద నీళ్లు పక్కలకు తోసుకుంది, ఓ చేత్తో తడిసిన చీర సర్దుకుంటూ. తలుపు తెరచుకుంది. "ఎవరూ!"

ప్రమీల ఏదో చెప్పే లోగానే "ఓ మీరా! రండి లోపలికి." ఆశ్చర్యంగా చూసింది ప్రమీల. "రెడ్డి. ఇక్కడుంటాడన్న మాట." ఫైనలియరు బి.కాం. చదువుతున్నాడు.

"అయ్యో! ఇక్కడి కొచ్చానేమిటి." ఎందుకో భయం లాంటిది కలిగింది. రయ్యిన గాలి. గుమ్మంలో నిల్చున్న అతను కూడా కొద్దిగా తడిశాడు.

"రండి లోపలికి బాగా వర్షంగా వుంది. కాస్త తెరిపి యివ్వగానే వెళ్ళొచ్చు." వెనక్కి జరిగి, మొహం తుడుచు కుంటూ అన్నాడు. తట పటా యించింది. మరో సారి వెట్టిగా గాలి, గదిలో ముందు భాగం తడిసిం దీసారి జల్లుకి. చటుక్కున లోపలికి అడుగు వేసింది. చలికి వణుకు పుడుతోంది. తడిసిన పమిటనే మరింత బిగదీసు కుంది. "కొంచెం వుండండి" అంటూ, ముందుకు వచ్చి తలుపులు వేశాడు తటాలున. భయం భయంగా చూసింది ప్రమీల. దండెం మీది తువాలు తీసి యిస్తూ "తుడుచు కోండి" అన్నాడు. తలుపులేసే లోపుగా అతనూ కొద్దిగా తడిశాడు మరో తువాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. తువాలు అలాగే చేత్తో పట్టుకుని నిలబడిపోయింది, తలుపుకి పక్కగా. అయోమయంగా వుంది. 'ఏమిటీ వర్షం, ఆకాశానికి పిచ్చె త్తిందా? ఇలా ఎంతసేపని తనుం టుంది? తలుపులు కూడా వేసేశాడే!' గుండెలు దడదడ మన్నాయి. ఓ స్టూల్ ముందుకు జరుపుతూ 'కూర్చోండి' అన్నాడు. వారగా ఓ మడత మంచం, మరో పక్క అలమార్లో ఏవో పుస్తకాలు. గోడకి అద్దం, చిన్నగది. బ్రహ్మచారి నిలయం. బెరుగ్గా స్టూలు మీద కూచుంది. మొహమాట పడుతూనే మొహం తుడుచుకుంది. 'ఆ రౌడీ రాంబాబు బృందంలో యీ రెడ్డీ ఓ ముఖ్యుడే. ఆడ పిల్లల్ని ఏదో ఒకటి అని ఏడిపిస్తూనే ఉంటారా బృందం వాళ్లు. కాలేజీ మొత్తానికి ఆ బృంద మంటే హడలే. ఆడ పిల్లల పాలిటి రావణులు, కీచకులూను. మేక తిన్నగా వెళ్ళి పులి నోట్లో పడ్డట్టు పడిందిక్కడ తను. తన నేమయినా చేస్తే ... చేస్తాడా? అసలు తనెలా లోపలి కడుగు పెట్టింది? ఇప్పుడు వెళ్ళిపోతా నంటేనో! ఇంత వర్షంలో నడవడమే కష్టం, హోరున ఆ గాలి కూడాను. ఎలాగైనా సరే వెళ్తేనే మంచిది. తలుపు తియ్య మంటాను. 'ఏం' అని అడిగితే! తను భయపడు తోందని తెలిసిపోతుం దేమో! తెలిస్తే మరీ లోకువ. ఎలా? ఎలా ఇప్పుడు? ఏమైనా సరే! ఇంట్లో కంగారు పడతారు, ఎలాగైనా చేరు కోవాలి అని చెప్పి ..." ముఖం తుడుచుకుంటునట్లు నటిస్తూ, తువాలు ఓ పక్కకు ఒత్తిగించి ఓరగా చూసింది. మంచం చివర కూర్చుని, అటువేపు తిరిగి, సిగరెట్టు వెలిగిస్తున్నాడు. గొంతు సర్దుకుంది. అంతే! టక్కున లైట్లు ఆరిపోయాయి. ప్రమీలకి గుండెలు జారిపోయాయి. "మై గాడ్" పైకే అనేసింది. "కరెంటు పోయినట్టుంది." నెమ్మదిగా రెడ్డి మాట. క్రూర మృగ మేదో నాలుక చప్పరించుకుంటున్న ట్టుంది ప్రమీలకి. అంత వరకూ ఎలాగో కళ్ళాలు బిగించి పట్టుకున్న ధైర్యం, పెంకి గుర్రంలా పట్టుతప్పించుకుని పారి పోయింది. ప్రమీలకి అంత వర్షంలో చమటలు పట్ట సాగాయి. సన్నగా వణుకు. "తన పని అంతే! భగవాన్! పాడు సినిమా! ఎందు కెళ్ళానో! అసలే రౌడీ! ఆ పైన అనుకూల వాతావరణం. కళ్ళ నిండుగా నీళ్లు కమ్ముకొచ్చాయి. చిన్నగా చప్పుడు. ఉలిక్కిపడింది. వచ్చేస్తునాడు.. వచ్చేస్తున్నాడు.. తన గతి ... అమ్మ! నాన్నా ... ఈ పాడు సినీమా కోరిక.. నన్నెంత గతి కీడ్చిందో! ఏం చెయ్యాలి! చెయ్యి కొరికి.. లేకపోతే.. ఈ స్టూల్ ఎత్తి

నెత్తి మీద ఒక్కటి పెడితే.. గట్టిగా అరచి.. అబ్బే! ఈ వానలో హోరులో ఎవరు వినిపించు కుంటారు? గుండెలు. భయంతో విపరీతంగా కొట్టుకుం టున్నాయి. అంతలో ఛాతీ మీద ఏదో స్పర్శ. వెర్రిగా, భయంతో 'కెవ్వు' మంది "ఏమిటండీ.. ఏమిటది?" గదిలో మరో మూలనుంచి రెడ్డి కంఠం.

"ఆ!" అతను.. కంఠం ఆ మూల నుంచి.. ఓహ్! అతను తన దగ్గరకు రాలేదన్న మాట. "అమ్మయ్య!" ఇంకా ఆమె కోలుకోలేదు. మళ్లీ అడిగాడతను ఆశ్చర్యపడుతూ!

తడబాటు నణచుకుంటూ చెప్పింది. "ఏం లేదండి, ఏదో వంటిమీద పాకినట్టయింది" కంఠంలో వణుకు తగ్గలేదు.

"అదా! బొద్దింక అయుండచ్చు లెండి."

"ఇంకా అక్కడే వుండి మాట్లాడు తున్నాడే. సినిమాలో విలన్‌లా నెమ్మదిగా, కులాసాగా, నవ్వు కుంటూ వెనగ్గా వచ్చి.." వెన్నులో ఝల్లు మంది. అగ్గి పుల్ల గీసిన చప్పుడు. ఆ చిన్న వెలుగులో అతని ముఖం భయంకరంగా! అప్పుడు అటు తిరిగి కూర్చున్నాడు. ఇప్పుడు ఇటు తిరిగాడే! అలాగే.. మెల్ల మెల్లగా లేచి తన వేపు... ఏడుపు గొంతు లోంచి దూకటానికి మారాం చేస్తోంది. తువాలు నోట్లో కుక్కుకుని లేచి నిలబడింది. తలుపు కనిపించటం లేదు. చీకటి. కాని ముందుకు అడుగు వేసింది తలుపు కేసి. 'గొడుగు వుండాలే' స్వగతంలా అన్నాడు మరో అగ్గిపుల్ల గీసాడు. అలమారు పైకి ఎత్తి పట్టుకుని చూశాడు. 'ఆ వుంది!' మరో.. అగ్గి పుల్ల, కాల్తెత్తి రెండో చేత్తో గొడుగందుకున్నాడు.

"కొవ్వొత్తి కూడా లేదు." మళ్ళీ స్వగతం. మళ్ళీ అగ్గిపెట్టికి పని తగిలింది. జాగర్తగా చెయ్యి అడ్డం పెట్టి చూపిస్తూ, "అక్కడే వున్నారా! గొడుగు తీసుకోండి. తరువాత యిద్దరు గాని." "తలుపు తీస్తానుండండి" అంటూ, మళ్ళీ అగ్గి పుల్ల గీయకుండానే తలుపు గడియ తీసాడు. ఒక్క ఊదుటున బయటకు దూకింది కుందేల్లా. కాస్త వెలుగ్గా అన్పించింది. అటు, ఇటు వూగే గొడుగును అతి కష్టం మీద ఆపుతూ, జాగ్రత్తగా అడుగు వేసి, తమ యింటి కెదురుగా గుళ్లో వేంచేసిన అమ్మ వారి విగ్రహాన్ని తల్చుకుంటూ ఇల్లు చేరింది ప్రమీల.

మరునాడు.

"ఆ రాంబాబు గుంపులో రెడ్డిని చూశావే! విగ్రహం చూస్తేనే భయం వేస్తుంది." వసంత, వయ్యారంగా నడుస్తూ అంది పక్కనున్న ప్రమీలతో.

ఫక్కున నవ్వింది ప్రమీల. "ఆ - నా మొహం. విగ్రహపుష్టి, నైవేద్యనష్టి అని, అతన్లో సరుకేం లేదే పిల్లా! భయపడ వలసిన పనేలేదు" అంది. తల ఎగరేసి, కొంటెగా కళ్లు తిప్పింది. "ఏమిటి సంగతి?" చెలికత్తె లంతా ఉత్సాహంగా అడిగారు. ప్రమీల క్రితం రాత్రి సంగతి చెప్తూ, చివర్న, "వాళ్ల రూములోని బొద్దింక నయమనుకో!" అని విరగబడి నవ్వింది. చెలికత్తెలు కిలకిలలాడారు. ఓ అమ్మాయి వెనక్కి చూసింది "అదిగోనే రెడ్డి." గుసగుసగా అంది. "బొ... బొద్దింక." కిసుక్కు మన్నాయి కొన్ని కంఠాలు. రెడ్డి తిన్నగా ప్రమీల పక్కకి వచ్చేశాడు, చటుక్కున ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసి, దగ్గరకు లాక్కుని, మెరుపులా

చెంపకి పెదవులానించి వదిలేశాడు. నివ్వెర పోయి, నిలబడ్డారంతా. చెంప తడుము కుంటూ, అవమానంతో క్రుంగి పోతూ, కోపం, దుఃఖం పెనవేసుకోగా, కీచుగా అరిచింది ప్రమీల. "ఏమిటిది?"

రెడ్డి చిన్నగా నవ్వి, తాపీగా సిగ రెట్టు వెలిగించాడు.

"చూడమ్మా! బుల్లెమ్మా! మంచి తనం – పిరికి తనం. అణకువ – అతి వినయం. నిర్లిప్తత- చేతకానితనం. ఇలా కొన్ని కొన్ని విషయాలని వేరు చేసేది అతి సన్నని గీత. కళ్లు, బుర్ర ఉప యోగించి అది కనిపెట్టాలి. దేని కివ్వ వలసిన విలువ దానికివ్వాలి. లేకపోతే ఇలా . . . బెడిసి కొడుతుంది. మోడర్న్ లేడీస్, అభ్యుదయ భావాలు గల మీ రంతా ఇది తెలుసుకోండి మరి, ఈ విలువలు."

నెమ్మదిగా నడుస్తూ వెళ్లాడు రెడ్డి.

## అనాధ . . . . గులాం గౌస్

ఉదయాన్నే రైలు తల్లి
కేకలతో నిద్ర తలుపు తడుతుంది.
దూరంగా నీళ్ల పంపు
నులి వెచ్చటి విషాదాన్ని
ఆపుకోలేక విడిచేస్తూ
వెక్కిళ్ల కోసం వాడి కళ్లల్లో
వెదుకుతుంది.
ఎవరో? ఆ బాలుడు, పసి ఆరనివాడు
ఐదు వయసులో పడిపోయిన జీవితాన్ని
ఎంగిలి బీడీలతో తగలేసుకుంటున్నాడు
ఒంటి మీద పీలికలు పీలికలై గాలిస్తాయి.
అతడి కళ్లు రెండు
వెళ్లి పోయిన రైలు శబ్దాన్ని
కౌగలించుకొని ఏడుస్తాయి.
ఏ గాలి వాడికోసం పాలు తెస్తుంది.
ఏ పువ్వు మాతృ స్తన్యమై
వాడి పెదవులకు అందుతుంది.
కాలం విడిచిన కుబుసాల్లాంటి పట్టాల్లో
భవిష్యత్తు విషగ్రస్తమై
బుసలు కొడుతుంది.
పశువులు ఇళ్ళకు చేరుకుంటాయి.
పక్షులు గూళ్లకు చేరుకుంటాయి.
శవం లేచిపోయిన తరువాత
బావురు మంటూ మిగిలిన
శిథిల ప్రాంగణంలో
సంధ్య వెలుగు సమాధిలా
మంట మండుతుంది.
విరగ బూచిన శిరీష వృక్షం,
వేళ్ళు పెరుక్కొని ఆకాశ మార్గం
పట్టినట్లుంటుంది.
మబ్బు ముక్క ఒకటి కమిలిపోతుంది.
చిట్టి చినుకు ఒకటి వణుక్కుంటూ
నేలకు రాలి
గీతలా నిలబడ్డ వాడి కాళ్ల క్రిందకు చేరి
వాడ్ని ఆశ్చర్యార్థకంలా
మలచాలని చూస్తుంది.
రెండు చేతులు చేంతాళ్ళలా
దుమ్ములోకి జారవిడిచి
తెంచి పారేసి పోయిన తల్లిపేగుకోసం
పాతాళం వరకు ఆతృతగా
వెతుక్కుంటాడు.
ఒంటరి మైదానంలో నడుం విరిగిన
గడ్డిపరక
శోకమనే మంచు పర్వతాన్ని
మోస్తున్నట్లు కనిపిస్తాడు.
అప్పుడు వాణ్ని ఏ విదూషకుడూ
నవ్వించలేడు.
ఏ వైద్యుడూ నాడి అందుకోలేడు.